క్లుప్తంగా

మెగా వైద్య శిబిరం

కాకినాడ రూరల్: రోటరీ క్లబ్ ఎలైట్ ఆధ్వర్యంలో కాకినాడ అర్బన్ ఒకటో డివిజన్‌లోని శ్రీలక్ష్మి వినాయక ఫంక్షన్ హాలులో ఆదివారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. పెద్దఎత్తున స్థానికులు వైద్య శిబిరానికి హాజరయ్యారు. వారికి బీపీ, సుగర్ తదితర వైద్య సేవలను వైద్యులు అందించారు.

విద్యార్థులకు ల్యాప్‌టాప్‌ల అందజేత



విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందజేస్తున్న సభ్యులు

బాలాజీచెరువు: పూర్వ విద్యార్థులంతా కలిసి ఏర్పాటు చేసుకున్న రెడ్‌కాన్వెంట్ పూర్వ విద్యార్థుల చారిటబుల్ ట్రస్ట్(1978) ద్వారా ఏడేళ్ల కాలంలో రూ.70 లక్షలకు పైగా సేవా కార్యక్రమాలు నిర్వహించామని ట్రస్ట్ గౌరవాధ్యక్షుడు డాక్టర్ బాదం బాలకృష్ణ తెలిపారు. స్థానిక దేవాలయం వీధిలోని ట్రస్ట్ కార్యాలయంలో ఆదివారం ట్రస్ట్ ద్వారా ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థులకు ప్రముఖ ఆడిటర్ తాళ్లూరి శ్రీనివాసరాజు, ప్రసాద్ చేతుల మీదుగా ల్యాప్‌టాప్‌లు అందజేశారు. సేవా దృక్పథం కలిగిన ఇటువంటి ట్రస్ట్‌కు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి జగన్నాథం, కోశాధికారి కల్యాణి, వేదుల మధు, రెడ్నం రమణమూర్తి పాల్గొన్నారు.

నేడు డిప్యూటీ సీఎం గురుకుల పాఠశాల సందర్శన



పాఠశాలను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే తదితరులు

కాకినాడ రూరల్: పి.వెంకటాపురం గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సోమవారం మధ్యాహ్నం సందర్శించనున్నారు. పాఠశాలలో బయోలాజికల్ ల్యాబ్‌ను సందర్శించి, విద్యార్థినులతో భోజనం చేస్తారు. కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఎమ్మెల్యే పంతం నానాజీ ఆదివారం పాఠశాలను పరిశీలించారు. పాఠశాలకు కావాల్సిన అవసరాలను ప్రిన్సిపాల్ సుశీలను అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వంలో అప్పటి కలెక్టర్ కృతికా శుక్లా బయోలాజికల్ సామగ్రిని గురుకుల పాఠశాలకు సమకూర్చారు.

సినిమాలు

ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్:	లక్కీ భాస్కర్, అమరన్, బఘీర, సింగం అగైన్
దేవీ మల్టీప్లెక్స్ 4 స్క్రీన్:	భూల్ భులయ్యా-3, లక్కీ భాస్కర్, అమరన్, బఘీర
లక్ష్మీ:	క
సత్యగౌరి:	లక్కీ భాస్కర్
తిరుమల:	బఘీర
సిఅండ్‌డీ1:	అమరన్
సీఅండ్‌డీ2:	క
శ్రీప్రియ:	లక్కీ భాస్కర్
పద్మప్రియ:	దేవర
సూర్య1(వాకలపూడి):	లక్కీ భాస్కర్

నాడు క్లాప్స్.. నేడు ఫ్లాప్

- క్లాప్ వాహనాలను నిర్వీర్యం చేసిన సర్కార్
- చెత్త సేకరణకు మళ్లీ అవరోధం
- భారమంతా కార్పొరేషన్‌పై నెట్టేసిన ప్రభుత్వం



యార్డులో నిలిచిపోయిన క్లాప్ వాహనాలు

కాకినాడ: చెత్త సమస్య మళ్లీ మొదటికొచ్చింది... హూపర్ టిప్పర్ వాహనాల నిర్వహణను ప్రభుత్వం గాలికొదిలేసింది. బాధ్యత అంతా నగర పాలక సంస్థపై నెట్టేసి చేతులు దులుపుకొంది. ఫలితంగా హూపర్ టిప్పర్ వాహనాల నిర్వహణను చేపట్టే సంస్థకు చెల్లించాల్సిన రూ.3.50 కోట్లు డైలమాలో పడ్డాయి. అంత సొమ్మును నగరపాలక సంస్థ చెల్లించలేని పరిస్థితుల్లో.. ఇలాగైతే చెత్త సేకరణ చేయలేమంటూ కాంట్రాక్టర్ కూడా చేతులెత్తేశారు. ఫలితంగా జిల్లా కేంద్రం కాకినాడలో చెత్త సేకరణ సమస్య పెద్ద తలనొప్పిగా మారింది.

గత ప్రభుత్వ హయాంలో కేంద్ర ప్రభుత్వం ద్వారా స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ పర్యవేక్షణలో 100 హూపర్ టిప్పర్ వాహనాలను కొనుగోలు చేశారు. సుమారు రూ.7 కోట్లు వెచ్చించి గత ప్రభుత్వం వీటిని సమకూర్చింది. ప్రతి డివిజన్‌కు రెండేసి వాహనాలను కేటాయించి, ఇంటింటికీ వెళ్లి తడి-పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడంలో ప్రభుత్వం సఫలీకృతమైంది. సమర్థవంతమైన నిర్వహణ ద్వారా దేశంలోనే కాకినాడ గత ఏడాది రెండో స్థానాన్ని కూడా దక్కించుకోగలిగింది. అలాంటి పరిస్థితి నుంచి గడచిన 50 రోజులుగా చెత్త వాహనాలు యార్డుకే పరిమితమయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక క్లాప్ వాహనాల నిర్వహణకు చెల్లించాల్సిన రూ.3.50 కోట్ల విషయంలో తాత్సారం చేసింది. ఒకప్పుడు యూజర్ చార్జీల వసూళ్ల ద్వారా ఈ బకాయిలను నగరపాలక సంస్థ చెల్లించేది. కూటమి సర్కార్ ఈ మొత్తం భారాన్ని నగరపాలక సంస్థే చెల్లించాలంటూ ఉత్తర్వులు కూడా ఇచ్చేసింది.

చెల్లింపే పెద్ద సమస్య

ప్రభుత్వ ఆదేశాల నేపథ్యంలో రూ.3.50 కోట్లు చెల్లించడం నగరపాలక సంస్థకు భారంగా మారింది. కార్పొరేషన్ ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ప్రాథమికంగా రూ.30 లక్షలు చెల్లించేందుకు సిద్ధమైంది. అయితే ఆ సొమ్ము కూడా ఇప్పటికిప్పుడు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్ ఇక వాహనాలను నిర్వహించలేమంటూ మళ్లీ మొండికేశారు. ఫలితంగా 10 రోజుల క్రితం ప్రారంభించిన వాహనాలు మళ్లీ ఆగిపోయాయి. తమ బకాయిలు చెల్లిస్తేనే కాంట్రాక్టర్లకు వేతనాలు ఇవ్వగలమని, లేని పక్షంలో వాహనాలను నడపలేమంటూ తేల్చేశారు.

పుష్ కార్టులే ఆధారం

క్లాప్ వాహనాలు నిలిచిపోవడంతో చిన్న చిన్న పుష్ కార్టులపైనే నగరపాలక సంస్థ ఆధారపడుతోంది. వాటి ద్వారానే చెత్త సేకరణ చేస్తున్నారు. చిన్నచిన్న డబ్బాల్లో చేసే ఈ సేకరణ వల్ల తడి-పొడి చెత్త విధానం పక్కకు పోయింది. అవసరమైన మేరకు పుష్‌కార్టులు అందుబాటులో లేకపోవడంతో చెత్త సేకరణ రోజురోజుకూ తలనొప్పిగా మారింది. మొత్తం మీద ప్రజారోగ్య పరిరక్షణలో కీలకమైన చెత్త సేకరణ విషయంలో ప్రభుత్వ అలసత్వం ప్రజలకు ఇబ్బందికరంగా మారుతోంది.

ప్రభుత్వమే భరించాలి



క్లాప్ వాహనాల నిర్వహణను ప్రభుత్వమే భరించాలి. అందుకు అయ్యే ఖర్చును కార్పొరేషన్‌పై నెట్టడం ఏ మాత్రం సమంజసం కాదు. ఇలాంటి నిర్ణయం అభివృద్ధికి అవరోధంగా మారుతోంది. సొమ్ము చెల్లించలేక కార్పొరేషన్ చేతులెత్తేస్తే ఇక నగరం మురికి కూపంగా మారుతోంది. తక్షణమే బకాయిలు చెల్లించేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలి.

– పలివెల వీరబాబు, గౌరవాధ్యక్షుడు, క్లాప్ వాహన డ్రైవర్ల సంఘం

ఇబ్బందులు లేకుండా చర్యలు



క్లాప్ వాహనాలు నిలిచిపోయినప్పటికీ, చెత్త సేకరణకు అవరోధం లేకుండా చూస్తున్నాం. ప్రస్తుతం పుష్ కార్టుల ద్వారా మెరుగైన పారిశుధ్య నిర్వహణకు ప్రయత్నిస్తున్నాం. అదనంగా మరికొన్ని పుష్ కార్టులను కూడా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. క్లాప్ వాహనాలు నిలిచిపోయిన అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ పృథ్వీచరణ్, ఎంహెచ్‌వో, కాకినాడ

12 నుంచి దశావతార అలంకార ఉత్సవాలు



కాకినాడ మెయిన్ రోడ్డులోని సీతారామస్వామి

బోట్‌క్లబ్: నగరంలోని మెయిన్ రోడ్డులోని సీతారామస్వామి ఆలయంలో ఈ నెల 12 నుంచి 29 వరకూ రజిత చిన్న దశావతార అలంకార ఉత్సవాలు జరుగుతాయని ఆలయ ఈఓ యర్రా వేంకటేశ్వరరావు ఆదివారం విలేకర్లకు తెలిపారు. ఈ నెల 13న సాయంత్రం 6.30కు క్షీరాబ్ధి ద్వాదశి సందర్భంగా సీతారామస్వామి వారికి ద్వాదశ ప్రదక్షిణలు, సహస్ర దీపాలంకరణ, విశేష పూజలు నిర్వహిస్తారని వివరించారు. ఉత్సవాల్లో భాగంగా నిత్యం స్వామి వివిధ అలంకరణల్లో భక్తులకు దర్శనమిస్తారన్నారు. ఈ నెల 12న మహావిష్ణు అవతారం, 13న శేషశయన అవతారం, 14న మత్స్యావతారం, 15న కూర్మావతారం, 16న వరాహావతారం, 17న నరసింహావతారం, 18న వామనావతారం, 19న పరశురామవతారం, 20న శ్రీరామవతారం, 21న బలరామావతారం, 22న కృష్ణావతారం, 23న బుద్ధావతారం, 24న కల్కి అవతారం, 25న జగన్మోహిని అవతారం, 26న శ్రీవేంకటేశ్వరస్వామి అవతారం, 27న లక్ష్మీ హయగ్రీవ అవతారం, 28న ధన్వంతరి అవతారం, 29న విశ్వరూప సందర్శన అవతారంలో భక్తులకు దర్శనమిస్తారన్నారు.

శివాలయాలకు కార్తిక శోభ



అరట్లకట్టలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి



నడకుదురులోని బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి



కరపలోని రామలింగేశ్వరస్వామి శివలింగం



పెనుగుదురులోని బాలాత్రిపుర సుందరి సీతేశ్వరస్వామి



చినమామిడాడలోని పంచముఖేశ్వరస్వామి

- భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు
- ఆలయాలకు ప్రత్యేక అలంకరణలు



కరపలోని పర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం



పెద్దాపురప్పాడులోని ఉమాపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి

కరప: కార్తిక మాసం సందర్భంగా మొదటి సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు శివాలయాలు ముస్తాబయ్యాయి. కార్తిక మాసంలో సోమవారం శివుడిని ఆరాధిస్తే స్వామి కటాక్షం సిద్ధిస్తుందని భక్తుల విశ్వాసం. మండలంలోని కరప, కొరిపల్లి, అరట్లకట్ట, నడకుదురు, గురజనాపల్లి, పెనుగుదురు, గొర్రిపూడి, పెద్దాపురప్పాడు, వేళంగి, చినమామిడాడ, వాకాడ, వేములవాడ గ్రామాల్లోని శివాలయాల్లో భక్తుల కోసం ఆయా ఆలయ కమిటీలు ఏర్పాట్లు చేశాయి. కరపలోని శివాలయం మూడు శతాబ్దాల చరిత్ర కలిగిన అతి పురాతనమైంది. ఈ ఆలయంలోని పర్వత వర్ధినీదేవి సమేత రామలింగేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు చేస్తే కోరిన కోర్కెలు నెరవేరతాయని గ్రామస్తుల ప్రగాఢ విశ్వాసం. ఇక్కడ అభిషేకాలు, స్వామివారి దర్శనానికి అనుకూలంగా ఈఓ కె.తిరుమల రవితేజ అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రధాన అర్చకులు విలపర్తి శ్రీనివాస్ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. పెనుగుదురులోని శివాలయం 500 ఏళ్ల నాటిదని, ఇక్కడ శివలింగాన్ని సాక్షాత్తు సీతాదేవి ప్రతిష్ఠించినట్టు చెబుతారు. అందుకే ఇక్కడ బాలాత్రిపుర సీతేశ్వరస్వామిగా గ్రామస్తులు కొలుస్తారు. వేములవాడలోని భీమేశ్వరాలయంలో వేములవాడ భీమకవి పూజలు చేశారని, ఇక్కడే జన్మించారని గ్రామస్తులు నమ్మకం. అరట్లకట్టలో పూర్వకాలంలో మల్లె తోటలో శివలింగం లభించడంతో అక్కడ శివాలయం నిర్మించారని, అందుకే ఇక్కడి స్వామివారిని మల్లేశ్వరస్వామిగా గ్రామస్తులు కొలుస్తారు. ఆయా గ్రామాల్లోని శివాలయాలు పురాణ ప్రసిద్ధి చెందినవి కావడంతో, ఇక్కడ స్వామివారికి పూజలు చేస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం.

పురాతన ఆలయం

నడకుదురులో బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం కూడా అతిపురాతనమైంది. ఈ ఆలయ ప్రాంగణంలోని జమ్మిచెట్టుకు భక్తులు తమ కోర్కెలు విన్నవించుకుంటూ, రాసిన ఉత్తరాలను కట్టి, స్వామివారిని దర్శించుకుంటే కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. గతేడాది అప్పటి ఎమ్మెల్యే కురసాల కన్నబాబు నిధులు మంజూరు చేయడంతో పురాతన శివాలయాన్ని పునర్నిర్మించినట్టు గ్రామస్తులు తెలిపారు. నేపాల్, శ్రీకాకుళం తర్వాత పంచ ముఖాలు ఉన్న శివలింగం కూరాడ శివారు చినమామిడాడలో ఉంది. వేళంగి గ్రామానికి చెందిన మెర్లసూర్యమాంబ నేపాల్ తీర్థయాత్రలకు వెళ్లినప్పుడు చూసి, ఇక్కడ పంచముఖేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించి, దీపధూప నైవేద్యాలకు కొంత పంటభూమిని ఆలయం పేరున రాశారు. ఈ పంచముఖేశ్వరస్వామి ఆలయంలో వంశపారంపర్య ధర్మకర్త మెర్ల వీరయ్యచౌదరి కార్తిక మాసం పూజలకు ఏర్పాట్లు చేశారు. ఏటా కార్తిక మాసంలో ఆయా గ్రామాల పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి, స్వామివారికి పూజలు చేస్తుంటారు. ఆయా గ్రామాల్లోని శివాలయాలకు రంగులు అద్ది, విద్యుద్దీపాలతో అలంకరించారు.

కార్పొరేషన్‌కు ఎన్నికలు నిర్వహించాలి



మహాసభలో మాట్లాడుతున్న శేషుబాబ్జీ

కాకినాడ సిటీ: నగరపాలక సంస్థకు తక్షణమే ఎన్నికల నిర్వహించాలని, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జిల్లాలో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సీపీఎం నగర మహాసభ డిమాండ్ చేసింది. ఆదివారం కాకినాడ అన్నదాన సమాజంలో క్రామేడ్ సత్యనారాయణ నగర్‌లో సీపీఎం కాకినాడ మహాసభ త్రైవార్షిక విస్తృత సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడారు. ముందుగా సీనియర్ నాయకులు కర్రి నాగేశ్వరరావు అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. సీతారాం ఏచూరి, చుక్కన సత్యనారాయణరాజు చిత్రపటాలకు నివాళులర్పించారు. పార్టీ నాయకులు రాజశేఖర్, శేషుబాబ్జీ, ప్రసాదరావు మాట్లాడుతూ, నగరపాలక సంస్థకు తక్షణమే ఎన్నికలు నిర్వహించి ప్రజాపాలన సాగించాలన్నారు. ఉప ముఖ్యమంత్రి తిరుపతి లడ్డూ విషయం కంటే, జిల్లాలో వారికి పట్టం కట్టిన ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఉచిత ఇసుక హామీ చిత్తశుద్ధిగా అమలు చేయాలలన్నారు. ప్రజల అభ్యంతరాలు తెలిపినచోట మద్యం దుకాణాలు తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 8 నుంచి 15 వరకు అధిక ధరలు, నిరుద్యోగం, విద్యుత్ చార్జీల భారాలకు వ్యతిరేకంగా చేపడుతున్న ప్రజాపోరు కార్యక్రమానికి ప్రజలు సహకరించాలని కోరారు. పార్టీ నాయకులు జి బేబీరాణి, కరణం ప్రసాదరావు, పలివెల వీరబాబు, మలకా వెంకటరమణ, కె సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

దురదృష్టకరం

బోట్‌క్లబ్: విలీన గ్రామాల పెండింగ్ ప్రక్రియ పూర్తి చేయక, ఎన్నికల నిర్వహణ లేక ఆర్థిక సంఘం నిధులు రూ.20 కోట్లు వెనక్కి పోవడం దురదృష్టకరమని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పెండింగ్ ఆస్తిపన్ను రూ.62 కోట్లు వసూలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. మున్సిపల్ చట్టంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భవనాలకు ఆస్తి పన్నుకు ఎటువంటి మినహాయింపు లేదన్నారు. చెత్త పన్ను భారాన్ని రద్దు చేశామని ప్రకటించిన ప్రభుత్వం.. నిధులు కేటాయించకుండా ఆ భారాన్ని కార్పొరేషన్‌పై వేయడం శోచనీయమన్నారు. స్మార్ట్ సిటీ పెండింగ్ ఫండ్స్ రూ.250 కోట్లు రాకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలవుతున్నా కార్పొరేషన్ ఎన్నికలపై నిర్ణయం తీసుకోలేదన్నారు.

కాకినాడ టౌన్ రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరే రైళ్లు

ట్రైన్ నం.	స్టేషన్	గమ్య స్థానం	వెళ్లే సమయం	వచ్చే సమయం
17258	కాకినాడ పోర్టు	విజయవాడ (డైలీ మెము)	04.20	23.03
17267	కాకినాడ పోర్టు	విశాఖపట్నం (డైలీ మెము)	04.45	21.28
12755	కాకినాడ పోర్టు	భావనగర్ (భావనగర్)గురు	05.50	16.48
17206	కాకినాడ పోర్టు	సాయినగర్ (షిర్డీ) సోమ, బుధ, శని	06.10	18.55
17221	కాకినాడ పోర్టు	లోకమాన్య తిలక్ (ఎల్‌టీటీ) బుధ, శని	09.10	13.43
17655	కాకినాడ పోర్టు	పుదుచ్చేరి (సర్కార్) ఆది, బుధ, గురు	14.40	09.10
17644	కాకినాడ టౌన్	చెంగల్‌పట్టు (సర్కార్) సోమ, మంగళ, శుక్ర, శని	14.40	09.10
17250	కాకినాడ టౌన్	తిరుపతి డైలీ	15.15	11.45
17210	కాకినాడ టౌన్	బెంగళూరు (శేషాద్రి) డైలీ	17.25	06.45
12737	కాకినాడ పోర్టు	లింగంపల్లి (గౌతమి) డైలీ	19.20	06.58
07445	కాకినాడ టౌన్	లింగంపల్లి (స్పెషల్)సోమ బుధ, శుక్ర	20.10	07.10

ఘనంగా దండపాణి విగ్రహావిష్కరణ



అయ్యప్పస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన దండపాణి గురుస్వామి విగ్రహం



శత జయంతి ఉత్సవాల లోగోను ఆవిష్కరిస్తున్న శిల్పి రాజ్‌కుమార్ వడయార్

బోట్‌క్లబ్: ఉభయ గోదావరి జిల్లాలకు అయ్యప్ప స్వామి దీక్షను పరిచయం చేసిన దండపాణి గురుస్వామి విగ్రహాన్ని కాకినాడ భానుగుడి సెంటర్‌లోని అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం రాత్రి ఆవిష్కరించారు. దండపాణి గురుస్వామి శత జయంతి వేడుకల్లో భాగంగా ఈ విగ్రహం ఏర్పాటు చేయడం ఆనందకరమని ఆలయ కమిటీ సభ్యులు భాస్కర్ రెడ్డి, చిట్టూరి రవీంద్ర, ఆర్‌వీ రాయణం, నానాజీ తెలిపారు. తక్కువ రోజుల వ్యవధిలోనే దండపాణి గురుస్వామి విగ్రహాన్ని ఎంతో అందంగా రూపొందించి, అందించిన శిల్పి రాజ్‌కుమార్ వడయార్‌ను ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు. దండపాణి గురుస్వామి సజీవంగానే ఉన్నట్లు విగ్రహం రూపొందించాలని ఆయన కుమారుడు వేలు గురు స్వామి తెలిపారు. స్వామి శరణు ఘోష మధ్య దండపాణి గురుస్వామి విగ్రహావిష్కరణ కార్యక్రమం ఆద్యంతం సాగింది. ఆలయ పర్సన్ ఇన్‌చార్జి గోపాలకృష్ణ మాట్లాడుతూ తమ కోరికను మన్నించి ఎంతో అందంగా విగ్రహం తయారు చేసిచ్చిన శిల్పి రాజకుమార్ వడియార్ అభినందనీయులన్నారు. ఈ సందర్భంగా శిల్పి దండపాణి గురుస్వామి శత జయంతి ఉత్సవాల లోగోను ఆవిష్కరించారు. అనంతరం దండపాణి గురుస్వామి కుటుంబ సభ్యులు శిల్పిని సత్కరించారు. అలాగే దండపాణి గురుస్వామి కుమారుడు వేలు గురుస్వామిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో దత్తాత్రేయ గురుస్వామి, శ్రీరామ్ భగత్, పలువురు గురుస్వాములు, భక్తులు పాల్గొన్నారు.

7న చలో విజయవాడ

కాకినాడ సిటీ: ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ నెల ఏడున చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఏపీ ఎంఎస్‌ఆర్‌యూ కాకినాడ బ్రాంచ్ నాయకులు వెల్లడించారు. ఈ మేరకు ఆదివారం ఇక్కడ పోస్టర్‌ను ఆవిష్కరించారు. యూనియన్ జనరల్‌బాడీ సమావేశం స్థానిక సుందరయ్య భవన్‌లో జరిగింది. యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎంఏ స్వామి, సత్యశ్రీనివాస్ మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయిస్ యాక్ట్ 1976ను పటిష్ఠంగా అమలు చేయాలన్నారు. మెడికల్ రిప్రజెంటేటివ్‌లను హైలీ స్కిల్డ్ కార్మికులుగా గుర్తించి, కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాల స్థానంలో తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో ఈ నెల 7వ తేదీన జరుగుతున్న చలో విజయవాడ కార్యక్రమంలో కాకినాడ నగరంలో మెడికల్ రిప్రజెంటేటివ్స్ పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సి వెంకట్రావు, వర్మ, చరణ్, శ్యామ్, అప్పారావు, పాత్రుడు, కిషోర్, షంషుద్దీన్, శ్రీనివాస్, ఆది, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.